## క్లుప్తంగా

### హుజూర్‌నగర్ సీఐగా చరమందరాజు



హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నూతన సీఐగా జి.చరమంద రాజు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని మల్టీజోన్ ఐజీపీ ఆఫీస్‌లో వెయిటింగ్‌లో ఉన్న ఆయనను హుజూర్‌నగర్‌కు బదిలీ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా ఉన్న వై.రామలింగారెడ్డిని డీఎస్‌బీ సూర్యాపేటకు బదిలీ చేశారు.

**ఎస్‌ఐగా ముత్తయ్య బాధ్యతల స్వీకరణ**



హుజూర్‌నగర్ ఎస్‌ఐగా ముత్తయ్య ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సూర్యాపేట వీఆర్‌లో ఉన్న ఆయనను హుజూర్‌నగర్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న హరికృష్ణను డీఎస్‌బీ సూర్యాపేటకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

**మేళ్లచెరువు ఎస్‌ఐగా పరమేష్**



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ పరమేష్

మేళ్లచెరువు : మేళ్లచెరువు ఎస్‌ఐగా పరమేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.ఐ.సురేష్ వీఆర్ (ఎస్పీ కార్యాలయం) సూర్యాపేటకు వెళ్లగా ఆయన స్థానంలో నేరేడుచర్ల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న పరమేష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలు పరిరక్షిస్తానని తెలిపారు.

**కోదాడ ట్రాఫిక్ ఎస్‌ఐగా మల్లేష్**



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ మల్లేష్

కోదాడరూరల్ : కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా మల్లేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మల్లేష్ సూర్యాపేట వీఆర్ నుంచి కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు రాగా, ఇక్కడ పనిచేసిన రాంబాబు చిలుకూరు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ పట్టణంలో ట్రాఫిక్ క్రమద్దీకరణకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.


### ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



హాల్ టికెట్లు పరిశీలిస్తున్న పాఠశాల సిబ్బంది

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో చేరేందుకు ఆదివారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 480 మంది విద్యార్థులకుకు గాను 460 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి తెలిపారు.

### సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ బుచ్చిపాపయ్య

మునగాల : మండలంలోని వెంకట్రాంపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, మండల కార్యదర్శులు కీత రమేష్, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, గ్రామ శాఖ అధ్యక్షుడు బిట్టు వెంకన్న, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అనాథ పిల్లలకు అన్నదానం



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న దాతలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల జీప్సీ అనాథ పిల్లల వసతిగృహంలో ఆదివారం గరిడేపల్లి మండలం తాళ్లమల్కాపురం మాజీ సర్పంచ్ బానోతు వెంకటేశ్వర్లు తన కూతురు జహ్నవి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు అనాథ పిల్లలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ధన్‌పాల్, చిన్ని, దగ్గుపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# అడుగంటిన పురాతన బావి

- అనేక ఏళ్లుగా నిండు వేసవిలోనూ గ్రామానికి నీరందించిన బావి
- కోమటికుంట చెరువు ఎండిపోవడంతో ప్రస్తుతం గంటైనా సాగని మోటార్లు
- నీటి కష్టాల్లో కొమ్ముబండతండా



కొమ్ముబండతండాలో పొలాల్లో ఉన్న బావి, ఇన్‌సెట్‌లో అడుగంటిన బావిలో నీరు

చిలుకూరు : ఎన్నో ఏళ్లుగా ఎండ కాలాన్ని తట్టుకుని గ్రామస్తులకు తాగునీటిని అందించిన చిలుకూరు మండలంలోని కొమ్ముబండ తండాలో గల పురాతన బావి అడుగంటింది. దీంతో ఆ గ్రామం తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతోంది. అయితే మండలంలో నూతనంగా ఏర్పాటు అయిన గ్రామ పంచాయతీల్లో అతి చిన్న గ్రామ పంచాయతీ కొమ్ముబండ తండా. ఈ గ్రామంలో మొత్తం 102 ఇళ్లు ఉన్నాయి. మొత్తం 620 మంది జనాభా ఉన్నారు. 440 మంది ఓటర్లు ఉన్నారు. కాగా, గ్రామానికి ఆనుకొని ఉన్న పొలాల్లో సుమారుగా 80 ఏళ్ల క్రితం నాటి ఒక పురాతన బావి ఉన్నది. ఆ బావికి గ్రామ పంచాయతీ వారు మోటారు ఏర్పాటు చేసి గ్రామానికి పైపులైన్ల ద్వారా ఏళ్లుగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

**తండావాసులకు తీగునీటి కష్టాలు**

కాగా, ప్రస్తుతం ఎండలు ప్రారంభం కావడం, చుట్టు పక్కల పొలాల రైతులు తమ పొలాల నీటి కోసం చుట్టూ బోర్లు వేయడంతో పాటు గ్రామ శివారులోని కోమటికుంట చెరువు పూర్తిగా ఎండిపోవడంతో బావి అడుగంటింది. ప్రస్తుతం మోటార్లకు కనీసం గంట కూడా నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. దీంతో తండాకు తాగునీటి సమస్య వచ్చింది. మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రాకపోయినప్పటికీ ఆ బావి ఉండడంతో నేటికీ తండాకు తాగునీటి సమస్య రాలేదు. కానీ బావి ఎండిపోవడంతో గ్రామం తాగునీటి సమస్యలో చిక్కుకుంది. దీంతో అధికారులు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని పలువురు తండావాసులు కోరుతున్నారు.

**చుట్టుపక్కల బోర్లు వేయడంతో..**



"గ్రామంలోని పొలాల్లో ఉన్న బావిలో ప్రస్తుతం నీళ్లు అడుగంటాయి. నేటివరకు ఈ బావి ఎప్పుడూ ఎండిపోలేదు. కానీ బావి చుట్టు పక్కల రైతులు బోర్లు వేయడం, కోమటికుంట చెరువు ఎండిపోవడంతో బావిలో నీళ్లు లేకుండా పోయాయి. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. నీటి సమస్యను పరిష్కారించాలి.

– బాణోతు ప్రసాద్, కొమ్ముబండతండా

**నీటి సమస్యను పరిష్కరిస్తాం**



"గ్రామంలో ఎప్పటి నుంచో ఉన్న పురాతన కాలం నాటి బావిలో నీళ్లు అడుగంటి పోయాయి. బావిపై ఏర్పాటు చేసిన మోటారుకు నీళ్లు కనీసం గంట కూడా రావడం లేదు. దీంతో గ్రామంలో కొంత నీటి సమస్య ఉన్న మాట వాస్తవం. ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మిషన్ భగీరథ పైపులైన్లను అనుసంధానంగా పైప్‌లు ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరిస్తాం.

– ఆకాంక్ష, గ్రామ కార్యదర్శి, కొమ్ముబండ తండా గ్రామం

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వ విద్యార్థులు

మోతె : మండలంలోని సిరికొండ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999– 2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. మధుర స్మృతులను నెమరవేసుకుని ఆనందపడ్డారు. అనంతరం గురువులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు రంగయ్య, రత్నాచారి, వాజిత్‌అలీ, వెంకటరెడ్డి, వాసుదేవరావు, పూర్వ విద్యార్థులు రాము, రమేష్, హరిచంద్రు, ప్రతిమ, నగేష్, కాటమయ్య, సరిత, కె.సైదులు, వై.ఉప్పలయ్య, వీరభద్రం, రమేష్, హుస్సేన్, కరిముల్లా, విజకార్, తదితరులు పాల్గొన్నారు.

## సోమప్ప జాతరకు నిధులు మంజూరు చేయాలి

నేరేడుచర్ల : మండలంలోని బురుగులతండా వద్ద గల సోమప్ప ఆలయ జాతరకు నిధులు మంజూరు చేయాలని క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ సుంకర క్రాంతికుమార్ కోరారు. ఆదివారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేళ్లచెరువు దేవాలయానికి దీటుగా సోమప్ప దేవాలయాన్ని తీర్చిదిద్దాలన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

## నియోజకవర్గ అధ్యక్షుడిగా పల్లె క్రాంతికుమార్

హుజూర్‌నగర్ : మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘం) హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పల్లె క్రాంతికుమార్‌ను నియమించినట్లు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఎన్‌టీయూసీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

## గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి



బంద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

గరిడేపల్లి : బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించబోయే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ కోరారు. ఆదివారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ ప్రగతిశీల హమాలీ, మిల్లు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే విధంగా కేంద్రం చట్టాలను చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములు, శేఖర్, శ్రీను, గోపయ్య, లక్ష్మయ్య, సైదులు, నారాయణ, నాగయ్య, అశోక్, రాజు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెన్నకేశ్వాపురంలో ఉచిత గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేస్తున్న నాయకులు

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు కోరారు. ఆదివారం నడిగూడెం మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్లను పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేకల లక్ష్మి, బోలగాని శ్రీలత, చెరుకు సునీత, కొండలమ్మ, కోటమ్మ, పాల్గొన్నారు.

## మానవతా విలువలు కలిగిన వ్యక్తి యాకోబు



యాకోబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాంబశివరావు, నాయకులు

హుజూర్‌నగర్ : మానవతా విలువలు కలిగిన వ్యక్తి హాస్టల్ వెల్ఫేర్ రిటైర్డ్ ఆఫీసర్ రేవూరి యాకోబు అని మానవ వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన యాకోబు సంస్మరణ సభను ఆదివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా యాకోబు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, సమాజం గురించి ఆలోచించేవారని అన్నారు. మూఢాచారాలకు, ఛాందస సంప్రదాయాలకు వ్యతిరేకంగా వివిధ వేదికల ద్వారారా ప్రజల్ని చైతన్యవంతం చేయడానికి నిరంతరం పాటుబడిన వ్యక్తి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ ఆఫీసర్ సందీప్‌బాగా, కాంగ్రెస్ నాయకులు సాముల శివారెడ్డి, స్పందన సామాజిక అధ్యయన వేదిక సభ్యులు పరాట్ కుమార్, దుర్గాప్రసాద్, కృష్ణమూర్తి, విశ్రాంత ఉద్యోగులు కేవీఎస్ మూర్తి, దేవదానం, అప్పయ్య, సోమయ్య, ఎంఎస్ఎన్ రాజు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు నాయకులు పాల్గొన్నారు.

## రవాణా రంగ సమస్యలు పరిష్కరించాలి



లారీ ఓనర్స్ ఆల్ ఇండియా సమావేశాలకు తరలివెళ్తున్న నాయకులు

కోదాడఅర్బన్ : రవాణా రంగ సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని,హీ హీట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కలకత్తాలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆల్ ఇండియా లారీ ఓనర్స్ సమావేశానికి కోదాడ నుంచి రాష్ట్ర నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఇందర ధరలు, టోల్‌గేట్ చార్జీలు, గ్రీన్ టాక్స్, ఇన్సూరెన్స్ ప్రీమియం భారాలు, పోలీస్ చలానాలతో లారీ యజమానులు దేశవ్యాప్తంగా ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. పలు సమస్యలపై ఆల్ ఇండియా సమావేశాల్లో చర్చించి భవిష్యత్ కార్యచరణను నిర్ణయిస్తారని తెలిపారు. ఈ సమావేశాలకు సంఘం రాష్ట్ర నాయకులు ఆవుల రామారావు, అంజిరెడ్డి, దుర్గాప్రసాద్, జగన్నాధరెడ్డి, ఖాన్, కనగాల నాగేశ్వరరావు, సాజిద్ ఖాన్, ఫయాజ్ తదతరులు ఉన్నారు.

## ప్రణాళికతో చదివితే విజయం సాధ్యం



మాట్లాడుతున్న చారుగండ్ల రాజశేఖర్

నడిగూడెం : విద్యార్థుతు ప్రణాళికతో చదివితే విజయం సాధ్యమని మానసిక వికాస నిపుణుడు, విజయీభవ ట్రస్ట్ వ్యవస్థాపకుడు చారుగండ్ల రాజశేఖర్ అన్నారు. ఆదివారం నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో జీవన నైపుణ్యాలు– వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవితంలో ఎదురయ్యే అపజయాలు విజయాలకు బాటలు వేస్తాయని నమ్మాలన్నారు. విజేతల అపజయాల నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. కాలం విలువైనదని, కాలాన్ని పొదుపుగా ఉపయోగించుకోవాలని చెప్పారు. ఆసక్తితో చదువు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ జగన్నాథం, చారుగండ్ల ప్రవీణ, పాఠశాల ప్రత్యేక అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

## తాగునీటి బావిని శుభ్రం చేయాలి



చెత్తాచెదారం, నాచుతో నిండిన తాగునీటి బావి

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడి గ్రామానికి మంచినీరు అందించే గ్రామపంచాయతీ బావి చెత్తచెదారం, నాచుతో అపరిశుభ్రంగా ఉందని, వెంటనే బావిని శుభ్రం చేయించాలని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో సగానికిపై జనాభాకు నీటిని అందించే ఈ బావిని పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ బావిలో నీరు కలుషితమై అతిసార, చర్మ వ్యాధులతో పాటు పలు రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలోనైనా బావిని శుభ్రం చేసి తమకు స్వచ్ఛమైన నీటిని అందించాలని కోరుతున్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి



అబ్బిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గరిడేపల్లి : మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం గరిడేపల్లి మండలంలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 5 తాగునీటి బోర్లలో మూడు బోర్లు పనిచేయక వారం రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ విషయంపై ఎంపీఓను సంప్రదించినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బండ్ల రోషమ్మ, సునిత, సైదులు, మహేష్, రాంరెడ్డి, వెంకన్న, గోపతి, వీరయ్య, ప్రశాంత్, పాషా, రమేష్, ప్రమీల, వీరస్వామి, పద్మ, రామస్వామి, వెంకన్న, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెలవు దినంగా ప్రకటించడం హర్షణీయం



రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు

హుజూర్‌నగర్ : గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీసంత్ సేవాలాల్ జయంతి రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడం గిరిజనుల జాతి హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు తేజవత్ సైదులునాయక్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి చిత్రపటాలకు నియోజకవర్గ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్, గిరిజన కుల పెద్దల సలహాలు, సూచనలతో సేవాలాల్ జయంతి ఉత్సవాలను పార్టీలకతీతంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తేజావత్ రవినాయక్, పీసీసీ సభ్యులు లకావత్ సైదులు, నాయకులు బానోతు భాస్కర్, బానోతు వెంకటేశ్వర్లు, పద్మబాయి, బానోత్ రాముడు, బానోత్ శివ, ఎంపీటీసీ రవినాయక్, సర్పంచ్ కృష్ణానాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీను, సొమ్య, డాక్టర్ నాగు, వినయ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్‌లకు సత్కారం



ఛైర్‌పర్సన్ సామినేని ప్రమీల దంపతులను సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కోదాడఅర్బన్ : కోదాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా సామినేని ప్రమీలరమేష్, వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన కందుల కోటేశ్వరరావును ఆదివారం కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన్‌లో రిటైర్డు ఉద్యోగులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదాడ పట్టణ అభివృద్ధికి ఇరువురు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఛైర్‌పర్సన్ ప్రమీల మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో పట్టణ సుందరీకరణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, కోదాడ యూనిట్ నాయకులు శ్రీనివాసరావు, రాంబాబు, విద్యాసాగర్, వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



కోదాడఅర్బన్ : వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



మఠంపల్లిలో నగర సంకీర్తన నిర్వహిస్తున్న మహిళలు

కోదాడఅర్బన్ : కోదాడలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పుష్పాలంకరణలు, పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు గావించారు. కాగా కోదాడ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో దేవరశెట్టి బ్రహ్మయ్య, లక్ష్మీప్రవీణల సహకారంతో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు నాగరాజు, భాస్కర్, ప్రసాద్, లక్ష్మీనర్సయ్య, లోకేశ్వరరావు, సతీష్, శ్రీనివాసరావు, సాయి, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**మఠంపల్లిలో..**

మఠంపల్లి : మండల కేంద్రంలో శ్రీ కనకదుర్గ దేవాలయంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం, గోమాత పూజ, భజన, నగర సంకీర్తన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు, యూత్ సంఘం సభ్యులు, మహిళా వాసవీ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ఐడియల్ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని, క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సైదానాయక్, పాఠశాల కరస్పాండెంట్ రమణకుమార్, వేణువర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధ్వానంగా కాలువ కట్ట



కొండాపురం బ్రిడ్జి వద్ద కాలువ కట్టపై నిలిచిన నీరు

చిలుకూరు : మండలంలోని కొండాపురం పరిధిలోని ముక్త్యాల కాలువ కట్ట అధ్వానంగా తయారైంది. కట్టపై నిత్యం నీరు పారుతోంది. పొలాల నుంచి నీరు కాలువ కట్టపైకి వస్తుండడంతో కట్ట దెబ్బతింటుందని పలువురు రైతులు అంటున్నారు. కాలువ కట్టపై కొత్త కొండాపురం నుంచి పాత కొండాపురం, మాధవగూడెం వెళ్లే ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

## ప్రహరీ లేక.. పాముల సంచారం



పొలాల మధ్య ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- జెర్రిపోతులగూడెంలో పొలాల మధ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
- ప్రహరీ లేకపోవడంతో స్కూల్‌లోకి వస్తున్న పాములు
- భయాందోళన చెందుతున్న విద్యార్థులు

చిలుకూరు : మండల పరిధిలోని జెర్రిపోతులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రామ శివారులో పొలాల మధ్య ఉన్నది. అంతేకాకుండా పాఠశాలకు ఒక పక్క ప్రహరీ లేదు. దీంతో పొలాల నుంచి పాఠశాలలోకి నిత్యం పాములు వస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు అనేకసార్లు ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో కూడా పలువురు వ్యక్తులు పాఠశాలలోకి వచ్చి మద్యం సేవించి బాటిళ్లు అక్కడే పడేసి వెళ్తున్నారని అంటున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు, ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.